బాధ్యతలు స్వీకరించిన డిఆర్ఒ

ప్రజాశక్తి - కాకినాడ

వెంకట్రావు

జిల్లా రెవిన్యూ అధికారిగా(డిఆర్ఒ)గా జె.వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్గా ఈయన బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను జిఎడికి రిపోర్ట్ చేయాలని సూచించిన ప్రభుత్వం డిఆర్ఒగా బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, జెసి ఆదేశాలు, సూచనలు మేరకు బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు. వెంకట్రావుని పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ షాన్మోహన్, జెసి రాహుల్మీనా లను మర్యాదపూర్వకంగా కలిశారు.

వేసెక్టమీపై అనాసక్తి

- ఆడవాళ్లకే అధికంగా కు.ని ఆపరేషన్లు
- ముందుకు రాని పురుషులు
- ప్రచారం చేయడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ అంటే కేవలం మహిళలే ముందుకు వస్తున్నారు. పురుషులు ఆమడ దూరంలో ఉంటున్నారు. వేసెక్టమీపై అవగాహన కొరవడడంతో ఆపరేషన్ చేయించుకునే మగవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అన్నిట్లో ముందుండే మగాళ్లు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో వెనకడుగు వేస్తున్నారు. వీటిపై ప్రచారం చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో 22,55,668 మంది జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రోత్సహిస్తోంది. 35 ఏళ్ల క్రితం ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చాలంటూ ప్రచారం చేశారు. ఆ తర్వాత పదేళ్లకు ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలే ముద్దంటూ ప్రచారంలోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లాలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీ యూనిట్తో పాటు 44 పిహెచ్ సీలలో, 9 సిహెచ్సీలు, ఒక ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్లు జరుపుతున్నారు. అయితే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స మహిళలకు మాత్రమే అనే భావన సమాజంలో బలంగా పాతుకుపోయింది.

గణాంకాలు			
	2022	2023	2024
ట్యూబెక్టమీ	6388	6108	5827
వేసెక్టమి	62	88	101

సంతాన నియంత్రణ ఆపరేషన్లు స్త్రీ, పురుషుల్లో ఎవరైనా చేయించుకోవచ్చు. కానీ మగవాళ్లు దీనికి సిద్ధం కారు. జిల్లాలో 90 శాతం మంది మగవాళ్లు ఇలాగే ఉన్నారని గణాంకాలను బట్టి తెలుస్తోంది. దాదాపు మహిళలే సంతాన నియంత్రణ ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటున్నారు.

స్త్రీలే అధికం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మహిళల కంటే పురుషులు చేయించుకోవడమే ఉత్తమమని, దీనికి అత్యంత సులువైన పద్ధతులున్నాయని వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు చెబుతున్నా దీనిపై పురుషులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో అక్టోబర్ వరకూ కేవలం 34 మాత్రమే పురుషులు వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకున్నారు. 2516 ట్యూబెక్టమి ఆపరేషన్లను స్త్రీలే చేయించుకున్నారు. మగవాళ్ల అపోహలను తొలగించడంతోపాటు ప్రోత్సాహ కాలను అందిస్తున్నా పురుషులకు పట్టడం లేదు. ట్యూబెక్టమి చేయించుకునే మహిళకు రూ.800, వేసెక్టమి చేయించుకునే వారికి రూ.1100 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. అయినా పురుషులు ముందుకు రావడం లేదు. ఏటా మహిళలు వేల మంది ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటే పురుషులు చాలా తక్కువ సంఖ్యలో వేసక్టమీ చేయించుకుంటున్నారు.

వైద్యుల కొరత

జిల్లాలో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో వేసక్టమి ఆపరేషన్లు సక్రమంగా నిర్వహించటం లేదు. కేవలం జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో మాత్రమే ఆపరేషన్లు జరుపు తున్నారు. పీహెచ్సీలు, సీహెచ్సీలలో ట్యూబెక్టమీ మాత్రమే చేస్తున్నారు. జిల్లాలోని పీహెచ్సీల్లో వేసెక్టమి సర్జన్లు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కేవలం ట్యూబెక్టమీ మాత్రమే చేస్తున్నారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలోని అన్ని పీహెచ్సీలలో కేవలం ఒక్క వేసెక్టమి మాత్రమే జరిగింది. సీహెచ్సీలలో 3 వేసెక్టమిలు జరగ్గా 1303 ట్యూబెక్టమీ చేశారు. ఒక ఏరియా ఆస్పత్రిలో 3 వేసెక్టమిలు జరగ్గా 369 ట్యూబెక్టమీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో 25 వేసెక్టమిలు జరగ్గా 760 ట్యూబెక్టమీలు చేశారు.

అంతంత మాత్రంగానే అవగాహన

అపోహల కారణంగా పురుషులు ఆపరేషన్ చేయించు కుంటే కష్టమైన పనులు చేయడానికి ఇబ్బందవుతుందనే ఆలోచనల్లో ఉన్నారు. శారీరకంగా బలహీనమవుతామనే భయం ఉంది. సంసార జీవితానికి ఆటంకమనే అనుమానం చాలా మందిలో ఉంది. కొందరు ఆడవాళ్లే తమ భర్తలను ఆపరేషన్కు దూరంగా ఉంచుతున్నట్లు వైద్యులు కూడా చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వేసక్టమిపై అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఆయా పీహెచ్సీల పరిధిలో తూతుమంత్రంగా కార్యక్రమాలను నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రుణాల కోసం కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

పంట రుణాల కోసం కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. బుధవారం స్థానిక స్టేట్బ్యాంకు, యూనియన్ బ్యాంకుల వద్ద కౌలు రైతులు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలు రైతులుండగా, జిల్లాలో రెండు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని అన్నారు. అయితే వీరికి ప్రభుత్వం పంట రుణాలు ఇవ్వడం లేదని విమర్శించారు. జిల్లాలో రూ.7,200 కోట్లు వ్యవసాయ రుణ ప్రణాళిక లక్ష్యం కాగా రూ.3,900 కోట్లు మాత్రమే పంట రుణాలుగా ఇచ్చారన్నారు. అయితే 80 శాతం భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు రూ.3 వేల కోట్లు పంట రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. సాగు చేయని భూ యజమానులు పంట రుణాలను దండుకుంటున్నారని విమర్శంచారు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మొండిచేయి చూపిస్తుందని అన్నారు.కౌలు రైతులు రుణం కోసం బ్యాంకులకు వెళితే భూ యజమాని అంగీకారం కావాలని చెప్పడం తగదన్నారు. బ్యాంక్ అధికారులు, ప్రభుత్వం మానవతాదృక్పథంతో కౌలు రైతులకు రుణాలు ఇచ్చి సహకరించాలని కోరారు. అనంతరం స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు మేనేజర్లకు కౌలు రైతులు తీసుకొచ్చిన దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి చల్లా సంతోష్కుమార్, నాయకులు దడాల వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, గుత్తుల సూర్యనారాయణ, పంపన నాగేశ్వరరావు , డి.జాను, కొంభత్తుల వెంకటరమణ, నీలపల్లి, జార్జిపేట, పి.మల్లవరం, తాళ్ళరేవు గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్దంటూ రైతుల వినతి

ప్రజాశక్తి - తొండంగి


తహశీల్దార్కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మండలంలోని బెండపూడి గ్రామంలో పచ్చని పొలాల మధ్య విమానాశ్రయం వద్దంటూ సంబంధిత బాధిత రైతులు తహశీల్దార్కు వినతిపత్రం అందించారు. బుధవారం సుమారు 500 మంది రైతు లు తమ పొలాల వద్ద నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యా లయానికి చేరుకున్నారు. అనంతరం వారు తహశీ ల్దార్కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా రైతులు మీడియాతో మాట్లా డుతూ విమానాశ్రయం ఏర్పాటు చేయడం ద్వారా బెండపూడి, చిన్నయ్యపాలెం గ్రామాలకు చెందిన ఏడా దికి రెండు పంటలు పండే పొలాలు నాశనం అవుతా యని అన్నారు. తద్వారా ఆహార భద్రతకు కరువు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సుమారు 1200 మంది సన్న, చిన్నకారు రైతులు తమ భూములను కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పోలవరం, పుష్కర, హైవే రహ దారులకు భూములు కోల్పోయామని, విమానాశ్రయం అంటూ మాకున్న అరకొర భూములను కోల్పోతే తమ కుటుంబాల జీవణం ప్రశ్నార్ధకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించే యోచనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తే తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించాల్సి వుంటుందని రైతులు స్పష్టం చేశారు.

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.22 కోట్లు

ప్రజాశక్తి - శంఖవరం

ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం సత్య దేవునికి హుండీల ఆదాయం రూ.1,22,41,967 లభించింది. బుధవారం కొండపై దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్, ఛైర్మన్ ఐవి.రోహిత్ల సమక్షంలో అధికారులు నెల రోజుల్లో వచ్చిన వివిధ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 10.500 మిల్లి గ్రాముల బంగారం, 410 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించునట్లు అకౌంట్స్ విభాగం పర్యవేక్షణ అధికారి యనమల అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఎఇలు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని పలువరు కౌన్సిలర్లు కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్పర్సన్ గండ్రెడ్డి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. వైస్ ఛైర్మన్ గంధం నాగేశ్వరావు మాట్లాడుతూ ఎస్సి కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, కుళాయిలు 15 నిమిషాలకు మించి రావడం లేదన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రవికుమార్, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగిన క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

బకాయి జీతాల కోసం క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన 6వ రోజుకు చేరింది. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ సీనియర్ సభ్యుడు ఎం.శివశంకర్ మాట్లాడుతూ పండగలో కూడా కార్మికుల కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర అధికారులు జోక్యం చేసుకుని బకాయి జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులు నెల అంతా కష్టపడి తమ కుటుంబాన్ని పోషించుకోవడం కోసమే పనిచేస్తారని ఆ విధంగా పనిచేసిన కార్మికులకు 3 నెలలుగా జీతాలు బకాయి ఉంటే జీవనం ఎలా సాగించాలని ప్రశ్నించారు. బకాయి జీతాలు విడుదలతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. జిఓ నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం రూ.24,500 అమలు చేయాలన్నారు. అదనపు కమిషనర్ సుధాకర్ను కలవగా సోమవారం నాటికి ప్రభుత్వం నుంచి క్లారిటీ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, విక్టర్, కొండ బాబు, శివశంకర్, గంగాధర్, అరుణ్ కుమార్, సూరిబాబు, భైరవ స్వామి, దుర్గాప్రసాద్, దుర్గ బాబు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కాజులూరు

ట్రాన్స్ఫార్మర్ స్విచ్ను ఆన్ చేస్తున్న మంత్రి సుభాష్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని దిగుదురు గ్రామంలో ప్రజల అవసరార్థం ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఎస్సి కమ్యూనిటీ హాలును పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు రూ.3.40 కోట్లతో రహదారులు నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలు గుర్తించడానికి కమిటీ ఏర్పాటు చేసి ఆ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో సిఎస్ఆర్ నిధులను అధికంగా వెచ్చించి అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో నిధులు ఉన్నప్పటికీ దోచుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చారని ఎద్దేవ చేశారు. గత కొన్ని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న గొల్లపాలెం - కుయ్యేరు రహదారిని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు కొప్పిశెట్టి స్వామినాయుడు, మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, మండల టిడిపి అధ్యక్షులు పేపకాయల నారాయణరావు, క్లస్టర్ ఇన్ఛార్జ్ వనం వీరబ్రహ్మం, జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, స్థానిక నాయకులు పోతు పరమేశ్వరరావు, రంపాల రాజు, చంటిబాబు పాల్గొన్నారు.

పింఛన్లకు రూ.115.64 కోట్లు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో నవంబర్ 1వ తేదీన ఎన్టిఆర్ భరోసాలో 2,74,740 మంది లబ్ధిదారులకు రూ.115.64 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ సగిలి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ మాసపు పింఛన్ల పంపిణీ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందని, గ్రామ/వార్డ్ సచివాలయాలు సిబ్బంది పెన్షన్ దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను అందించాలన్నారు. 1వ తేదీనే నూరు శాతం పెన్షన్ల పంపిణీకి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఎక్కడ ఏ ఒక్క పొరపాటు జరగకుండా పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. ఇందుకోసం మండల స్థాయి ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని, ప్రతి గంటకు మానిటర్ చేయాలని ఆయన సూచించారు.

రోగ నిరోధక శక్తిని పెంచేందుకు చర్యలు

ప్రజాశక్తి - కరప

గర్భిణుల్లో రోగ నిరోధక శక్తిని పెంపుదల చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిఐఒ డాక్టర్ కెవి.సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని వేళంగి పిహెచ్సిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యురాలు డాక్టర్ క్రాంతి సౌజన్య గర్భిణులకు చేస్తున్న పరీక్షలు, ఇతర అంశాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన రోగ నిరోధక శక్తిని పెంపుదల చేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎస్ఓ గిరిగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సబ్ స్టేషన్ పరిధిలోని పల్లిపాలెం, గాడిమొగ ఫీడర్లో ట్రీ కటింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ, బైరవపాలెం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, సీతారాంపురం, కోరంగి, పెద్ద బొడ్డు వెంకటాయపాలెం, చిన్న బొడ్డు వెంకటాయపాలెం. చిన్న వలసల, పెద్ద వలసల, లక్ష్మిపతిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించి ఈ నెల 31వ తేదీ గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను నిర్వహించాలనికలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది రాష్ట్రీయ ఏక్తా ప్రతిజ్ఞ చేయాలని కోరారు. పోలీస్ దళాలు యూనిటీ మార్చ్ కార్యక్రమాలను, డివిజన్, మండల, మున్సిపల్ అధికారులు ప్రజల భాగస్వామ్యంతో రన్ ఫర్ యూనిటీ పరుగు కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అలాగే జైళ్లలో దేశ సమగ్రత అంశంతో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

చిన్నారులకు టపాసుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు టపాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ దీపావళి పండుగలో అన్ని జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రతి ఏటా చిన్నారులకు టపాసులు పంపిణీ చేస్తున్న అడబాల రత్నప్రసాద్ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాఘవరావు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రరావు పుట్టినరోజు

ప్రజాశక్తి - జగ్గంపేట

వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేత, గండేపల్లి మండల ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త చిన్న వీరభద్రరావు 56వ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగేశ్వర థియేటర్ ఆవరణలో ఆయన అభిమానులు కేకు కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు బుర్లు సాయి, జీను మణిబాబు, తులా రాము, వీర్రాజు గుప్తా, మల్లేపల్లి ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులు

అవినీతి రహిత సమాజం అవసరమని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిజిఎం ఎంఎస్ఆర్ పవన్కుమార్, హెచ్ఆర్ ఎస్ఎస్ఎన్.మూర్తి అన్నారు. బుధవారం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో అవినీతిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిని ప్రశ్నించాలని అన్నారు. మార్పు అనేది యువతతోనే మొదలవ్వాలని, సమాజానికి విశేష సేవలందించిన డా బిఆర్.అంబేద్కర్, స్వామి వివేకానంద వంటి వారి జీవిత చరిత్రలు తెలుసుకుంటూ వారి ఆశయాల సారాన్ని అలవరచుకోవాలని సూచించారు. అనంతరం దేశ శ్రేయస్సులో సమగ్రత సంస్కృతి అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందచేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పి.కృష్ణారావు, డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి.హరనాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్ కె.సత్య నారాయణ, ప్రిన్సిపల్ జి.నరేష్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యావరణ హితంగా దీపావళి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రతి ఒక్కరూ ధ్వని కాలుష్యం లేకుండా పర్యావరణ హితంగా దీపావళిని జరుపుకోవాలని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ సూచించారు. బుధవారం పాఠశాల విద్యార్థులచే బాణా సంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ఎకో క్లబ్ తరపున అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, ఎఎల్వి. కుమారి, కె.శ్రీనివాసు, ఎ.శ్రీవల్లి, పి.బ్రహ్మనందం పాల్గొన్నారు.

నిబంధనలు, జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - పెద్దాపురం

డిఎస్పి శ్రీహరిరాజు

బాణసంచా సామగ్రి విక్రయ వ్యాపారులు నిబంధనలు, జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని డిఎస్పి శ్రీహరిరాజు ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు, షరతులు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలో అక్రమ బాణసంచా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బాణసంచా వంటి పేలుడు పదార్థాలను గృహాల్లో నిల్వ చేయరాదని తెలిపారు. అధికారులు కేటాయించిన ప్రాంతంలోనే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

కార్టూన్ 'నిజం'



అతివేగంతో ఆకతాయిల హల్చల్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

బైక్తో ఢీకొట్టి బాలుడికి సపర్యలు చేస్తున్న ఆకతాయిలు

ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ కొందరు ఆకతాయిలు హల్చల్ చేస్తున్నారు. దీంతో పలువురు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఉప్పాడ - పిఠాపురం ప్రధాన రహదారిలో ఉన్న ఉప్పాడ హైస్కూల్, వివిఎస్ విద్యాసంస్థల నుంచి సాయంత్రం విద్యార్థులు బయటకు వచ్చే క్రమంలో కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనా లతో అతివేగంగా వస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. విద్యార్థినుల ఎదుట తమ ప్రతాపాన్ని చూపాలన్నా లక్ష్యంతో ఈ ఆకతాయిలు ఎదురుగా వస్తున్న వాహనాలను ఢికొట్టి ప్రమాదాలకు గురౌతున్నారు. బుధవారం సైకిల్ మీద వస్తున్న బాలుడిని ఒక ఆకతాయి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సైకిల్ ధ్వంసం కాగా, ఆ బాలుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గతంలో ఈ ఆకతాయిల వల్ల ఇద్దరు వ్యక్తులు ప్రాణాలను కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయి. విద్యార్థులను పాఠశాలలకు పంపాలంటే భయంగా ఉంటుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు పాఠశాలలు మూసివేసే సమయంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వివరాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ రాహుల్మీనా

ఇవిఎంలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - కాకినాడ

ఇవిఎం, వివిప్యాట్లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వీవీప్యాట్ గోదామును ఆయన పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెల ఇవిఎం, వివిప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ ఎస్.మల్లిబాబు, కలెక్టోరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోలవరం కాలువలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు పుష్కర కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. వీఆర్‌ఒ పేరూరి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసినట్లు ఎస్‌ఐ శివనాగ బాబు తెలిపారు. మురారి చెట్టుకట్ల ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరిగే వ్యక్తి మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగివుండి ఉంటుందని, సన్నని దేహంపై నామరంగు లోయరు, సిమెంటు రంగు బనియన్, ఎరుపు నీలం రంగు జబ్బల బనియన్, మెడలో నలుపు రంగు తాడు, కుడి చేతికి తెలుపు రంగు తాడు ఉండి, కుడి చేతి పై శ్రీరామ్ అను పచ్చబొట్టు ఉంది కుడి చేయి దండపై పులిబొమ్మ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో తిరుగుతున్న అంగర గ్రామానికి చెందిన ముద్రగడ చంద్రశేఖర్ (35)గా గుర్తించారు. అతని బంధువులకు సమాచారం అందజేయగా వారు మృతదేహాన్ని తీసుకొని వెళ్లారని ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ విలేకరులకు తెలిపారు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కోరుమిల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి కాశీ విశ్వనాథం(67) ఈ నెల 28న కోరుమిల్లి ప్రధాన పంట కాలువలోకి స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యారు. బుధవారం గ్రామంలోని లాకుల వద్ద ఆయన మృతదేహం లభ్యమయింది. ఆయన భార్య సూర్య నాగమణి ఫిర్యాదు మేరకు అంగర ఎస్‌ఐ డి.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

70 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని రాచపల్లి గ్రామ శివారు 70 లీటర్లు సారా అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం షాపులో చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మద్యం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.43 వేల విలువగల నగదు, మద్యం చోరీ చేశారని ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. దుండగులు తాళాలు బద్దలగొట్టి షాపులోకి చొరబడ్డారు. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షాపు యజమాని, సూపర్‌వైజర్‌తో కలిసి వివరాలు సేకరించారు. 21 మద్యం ఫుల్ బాటిల్స్, రూ.15,600 నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. షాపు సూపర్‌వైజర్ అడప ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పశుగణనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గ్రామాల్లో జరిగే పశు గణన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం 21వ అఖిలభారత పశు గణన గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఉన్న వెటర్నరీ సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి ఎన్ని పశువులు, ఎన్ని జంతువులు, ఉన్నాయో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి భరోసా కల్పించేలా పశువులకు బీమా, సీజనల్ వ్యాధుల్లో వాక్సిన్ వేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, నాలుగు మండలాల వెటర్నరీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 150 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రతి బుధవారం వైద్య, ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య సేవలు కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణుల కోసం మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం మాతృత్వం పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దిరెడ్డి నరేష్ తెలిపారు. ప్రముఖ న్యాయవాది అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఎజి పి)కందుల నరేష్‌కుమార్, ఝాన్సీ లక్ష్మీ దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కందుల నరేష్‌కుమార్, ఝాన్సీలక్ష్మి, గ్రూపు సభ్యులు లక్ష్మణ్ దివాకర్, శేఖర్, సత్యప్రశాంత్, లక్ష్మీరత్నం, జయశ్రీ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - కాజులూరు

ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన చెక్కును రామాలయ కమిటీకి అందజేశారు. గొల్లపాలెంలో గుండారం కాలనీ దగ్గర కోదండ రామాలయ నిర్మాణం నిమిత్తం రూ.10 లక్షలు ఇచ్చేందుకు టిటిడి శ్రీవాని ట్రస్ట్ ద్వారా ఇచ్చేందుకు దేవదాయ శాఖ మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.3.50 లక్షల చెక్కు రాగా, రెండో విడతగా వచ్చిన రూ.4.20 లక్షల చెక్కును బుధవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, గుబ్బల యేసురాజు చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చందాల శీను, వైస్ ఛైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, పితాని శివ, పంపన కృష్ణ, పలివెల రాజు, వడ్డాది ధరణి పాల్గొన్నారు..

పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు డిమాండ్ చేశారు. బుధవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, ఒసి విద్యార్థులకు స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

ప్లాస్టిక్ రాకతో మట్టి ప్రమిదలకు మంగళం

- ఆందోళనలో చేత్తివృత్తిదారులు
- వెలవెలబోతున్న దుకాణాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మట్టి ప్రమిదలు దీపావళికి వెలుగులు పంచుతాయి. మట్టి ప్రమిదలు అమ్మకాలు తగ్గిపోవడంతో వాటిని తయారు చేసే కార్మికుల జీవితాల్లో చీకటి నింపుతున్నాయి. ప్లాస్టిక్ ప్రమిదలు మార్కెట్లోకి రావడంతో

ఖాళీగా కూర్చున్న మట్టి ప్రమిదల విక్రయదారుడు

మట్టి ప్రమిదల విక్రయాలు దారుణంగా పడిపోయాయి.

ప్రతి ఏటా దీపావళికి మట్టి ప్రమిదలు తయారు చేసే కుటుంబాలు నియోజకవర్గంలో సుమారు 100 వరకూ ఉన్నాయి. వీరంతా దీపావళికి రెండు, మూడు నెలల ముందు నుంచే ప్రమిదలు తయారు చేయడం ప్రారంభిస్తారు. వివిధ రకాల ఆక్రుతుల్లో వాటిని తయారు చేస్తారు. ఇందుకు మట్టితోపాటు, వాటిని కాల్చేందుకు కట్టెలకు పెట్టుబడి పెడతారు. ఈ ఏడాది దీపావళికి ఆయా కుటుంబాలకు ఎంతో పెట్టుబడి పెట్టి మట్టి ప్రమిదలను తయారు చేశారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లోకి ప్లాస్టిక్ ప్రమిదలు రావడంతో మట్టి ప్రమిదల విక్రయాలు సన్నగిల్లాయి. డజను ప్రమిదలు రూ.30 నుంచి రూ.40చ మధ్య ధర నిర్ణయించి విక్రయాలు చేస్తున్న చేసిన కష్టానికి తగిన ఫలితం రావడం లేదని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

దీపావళి పండుగ సందర్భంగా మట్టి ప్రమిదలను వినియోగించాలి. పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్లాస్టిక్ ప్రమిదలను నిషేధించాలి. వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఆసరాగా నిలవాలి.

-పసుపులేటి రాఘవులు, వినియోగదారుడు, ప్రత్తిపాడు

విక్రయాలు తగ్గడంతో కష్టాలు

దీపావళి కోసం రెండు, మూడు నెలల నుంచే ప్రమిదలను తయారు చేస్తాం. మార్కెట్‌లోకి ప్లాస్టిక్ ప్రమిదలు రావడంతో మాకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి పెట్టి ఎంతో శ్రమ చేసి తయారు చేసిన మట్టి ప్రమిదల విక్రయాలు తగ్గిపోయాయి. ప్లాస్టిక్ ప్రమిదలను నిషేధించాలి.

టి.వీరబాబు, ప్రమిదల విక్రయదారుడు, కిర్లంపూడి

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పిఠాపురం

అధికారులను నిలదీస్తున్న మహిళా కౌన్సిలర్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిలర్లు గళమెత్తారు. మున్సిపల్ ఆస్తుల అన్యాక్రాంతం అంశంపై కౌన్సిల్ సమావేశం రగడగా మారింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్ పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర అత్యవర సప్లమెంటరీ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో అజెండాలో అంశాలు చదువుతుండగా కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వరి సాధారణ సమావేశం పెట్టకుండా ఎందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ నామ కనకారావు మాట్లాడుతూ గత అజెండాలో రాటిఫికేషన్ అంశాలు రద్దు చేయడంతో కమిటీ నిర్ణయం మేరకు సమావేశం ఏర్పాటు చేయాలని అనుకున్నామని, కమిటీ నిర్ణయం రాక అత్యవసర సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, తలిశెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ పని చేయకుండా ఉన్న కాంట్రాక్టర్లపై ఏ చర్యలు తీసుకున్నారని, పని అడిగితే ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెడతామని కాంట్రాక్టర్ సత్తిబాబు అధికారులను బెదిరింపులకు పెడుతుంటే ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిల్ తీర్మాణించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ లలితా దేవి మాట్లాడుతూ స్కూల్లో ఫ్యాన్లు పని చేయటం లేదని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. పెదపాటి నాగేశ్వరరావు, బొజ్జ రామయ్య, కోళ్ల బంగారు బాబు, రాయుడు శ్రీను మాట్లాడుతూ మున్సిపల్ ఆస్తులు అన్యాయక్రాంతమవుతున్న ఎవరూ పట్టించుకోవటం లేదని, ఇటీవల 7వ సచివాలయంలో చోరీ జరిగిన అంశంపై కౌన్సిలర్ నల్ల రవణమ్మ ఫిర్యాదు చేసినప్పటికీ పోలీస్ కేసు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. దీనిపై కమిషనర్ పోలీస్ కేసు పెట్టడం జరిగిందని వివరణ ఇచ్చారు. కౌన్సిల్స్ సమావేశానికి డిఇ భవానిశంకర్, ఎఇ రత్నవల్లి గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఉన్న 19 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తదుపరి అత్యవసర సప్లమెంటరీ సమావేశంలో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చేపట్టవలసిన అభివృద్ధి పనులను ఆమోదించారు. కౌన్సిల్ సమావేశంలో అకౌంటెంట్ పద్మజ్యోతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వల్లిప్రియ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణలపరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ షాపుల్లో భద్రతా ఏర్పాట్లును సిఐ ఎ.కృష్ణభగవాన్ బుధవారం పరిశీలించారు. దుకాణాల వద్ద ఇసుక, నీరు, అగ్నిప్రమాద నిరోధక సామాగ్రిని అందు బాటులో ఉంచాలని వ్యాపారులకు సూచించారు.

ఆదిత్యలో గ్రీన్ దివాళి వేడుకలు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గ్రీన్ దివాళి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలన్నారు. ముగ్గులు, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు అందించారు. ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జ్, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

24న శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ ఏడాది నవంబర్ 24న అమలాపురం పరిధిలోని కొంకాపల్లిలో ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తీక వన సమారాధనను నిర్వహిస్తున్నట్లు కోనసీమ శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన కమిటీ నాయకులు రాయుడు సత్యఋషి, ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. బుధవారం పి.మల్లవరం పత్తిగొందిలో జరిగిన సమావేశం మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కాలా సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక మాస సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సంఘీయులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వనసమరాదన ఆహ్వానానికి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శెట్టిబలిజ సంఘీయులు

సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సంఘ నాయకులు చిట్టూరి కలికి మూర్తి, అత్తిలి బాబురావు, జిత్తుగ శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, మట్టపర్తి నూకరాజు, కడలి శ్రీనివాస్,పెంకే ఏడుకొండలు, ఎంఎస్ఆర్, కాలా వెంకటరమణ పాల్గొన్నారు. అంతకుముందు కోరంగి పంచాయతీ సీతారాంపురంలో టేకుమూడి లక్ష్మణరావు స్వగృహం వద్ద, తాళ్లరేవు మాధవరాయునిపేట రామాలయం వద్ద కార్తీక వన సమారాధనపై చర్చించారు.

టిటిడి బోర్డు మెంబర్‌గా జ్యోతుల

ప్రజాశక్తి - జగ్గంపేట



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ నియమితులయ్యారు. నెహ్రూ టిటిడి బోర్డు మెంబర్‌గా ఎంపిక కావడం పట్ల అభిమానులు, నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు స్థానిక టిడిపి కార్యాలయానికి చేరుకుని సంబరాలు చేసుకున్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీలో సీనియర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం మంచి గుర్తింపు ఇచ్చిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

విజన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఎస్‌పి జడ్‌పి పాఠశాలలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ ఇవివి.ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోను పిల్లల చదువులపై ప్రభావం చూపుతుందన్నారు. సెల్‌ఫోన్‌ను చీకటి గదిలో చూడటం, ముఖానికి దగ్గరగా చూడటం వలన కంటి సమస్యలు ఏర్పడు తున్నాయని అన్నారు. సెల్ ఫోన్‌ను అధికంగా చూడడంతో పది శాతం కంటే అధికంగా కంటి దోషాలకు గురవుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఆ దోషాలను గుర్తించడం లేదని అన్నారు. పాఠశాలలో కంటి వైద్య శిబిరాల ద్వారా ప్రాథమిక స్థాయిలోనే కంటి దోషాలను గుర్తించడం జరుగుతుందని, తద్వారా వాటిని నివారించే అవకాశం ఉందన్నారు. క్లబ్ అధ్యక్షురాలు ఎంవివి.ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ ఎం.విశ్వేశ్వరరావు, లయన్స్ ప్రాంతీయ ఛైర్మన్ పద్మ తులసి, జోన్ ఛైర్మన్ చిట్నీడి నాగమణి, క్లబ్ కార్యదర్శి శ్రీదేవిరెడ్డి, కోశాధికారి శ్రీవాణి, ఆర్.సునీత, ఎంవి.శాస్త్రి, హెచ్ఎం గాయత్రి పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా నడుచుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థి దశ నుంచే ఆదర్శవంతమైన నడవడికతో నడుచుకోవాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిజిఎం పవన్‌ఖుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సూరంపాలెం గ్రామంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు 'దేశ శ్రేయస్సులో సమగ్రత-సంస్కృతి' అనే అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ గవర్నెన్స్ ద్వారా అవినీతిని అరికట్టే విధానాన్ని వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కోటేశ్వరరావు, ఎఎస్ఎన్.మూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు

ప్రజాశక్తి - కాజులూరు

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎల్.శివకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని మంజేరు గ్రామంలో రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన భూ సర్వేలో జరిగిన లోపాల వల్ల రైతుల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తుందన్నారు. రీ సర్వేలో జరిగిన ఖాతా నెంబర్‌లో తప్పులు, సబ్ డివిజన్లో తప్పులు, దళిత అంశాలపై సరిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటూరు అప్పారావు, ఎంపిటిసి సభ్యులు గండి మణికంఠ, మండల సర్వేయర్ సూర్యనారాయణమూర్తి, విఆర్‌ఒ మణికొండ బాలాజీ, విలేజ్ సర్వేయర్ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

యువత నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

యువత నేరాలకు దూరంగా ఉండి విలువైన జీవితాలను ఉన్నంతంగా తీర్చి దిద్దుకోవాలని సిఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఖాళీగా తిరుగుతున్న ఆకతాయిలకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఖాళీగా ఉండటంతో చెడు వ్యసనాలకు లోనవుతారని, చదువులోగానీ, ఏదైనా పనిలో గానీ నిమగ్నమై ఉండాలన్నారు. తల్లిదండ్రులకు భారంగా ఉండకుండా, వారికి చెడ్డపేరు తీసుకురాకుండా జీవించాలని సూచించారు. కళాశాలల వద్ద, పాఠశాలల వద్ద ఈవిటీజింగ్‌కు పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, నాటుసారా వంటి వ్యాసనాలకు లోనుకాకుండా తల్లిదండ్రుల మాట వింటూ మంచిగా జీవించాలని సూచించారు.

పట్టభద్రులు ఓటర్లుగా చేరాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

నియోజకవర్గంలో పట్టభద్రులంతా ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లగా నమోదు చేయించుకోవాలని ఎంఎల్‌సి వేపాడ చిరంజీవిరావు కోరారు. బుధవారం పి.మల్లవరం డిజిబి కళ్యాణ మండపంలో ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల కూటమి అభ్యర్థిగా పోటీ చేయనున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని గ్రామ కమిటీ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ కమిటీలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ శివన్నారాయణ, మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, ముత్యాల జయలక్ష్మి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ జె.వెంకటరావు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఈ నెల 21న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గోదావరి, ఏలేరు, పుష్కర, పంప, సుబ్బారెడ్డి సాగర్, తాండవ, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆయకట్టు కింద నీటి సంఘాలకు నవంబర్ 20 నుంచి 22 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గం వారీగా అడంగల్ అనుసరించి రైతులు వివరాలు సిద్ధం చేయాలన్నారు. ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఓచర్ పెయిడ్ ఉద్యోగుల దీక్ష విరమణ

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ కార్యాలయం ఎదురుగా 7 రోజులుగా ఓచర్ పెయిడ్ ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్ష బుధవారం విరమించారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం అంగీకరించడంతోపాటు, ముఖ్యమంత్రి రంగస్వామి తమ జీతాలను రూ.10 వేల నుంచి రూ.18 వేలకు పెంపుదల చేస్తూ ఫైల్‌పై సంతకం చేయడంతోపాటు, గవర్నర్ సంబంధిత ఫైల్‌ను పరిశీలించి ఆమోద ముద్ర వేయడంతో దీక్షను విరమిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రంగస్వామి చిత్రపటానికి ఉద్యోగులు పాలాభిషేకం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యానాం ఓచర్ పెయిడ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ నాగబాబు మాట్లాడుతూ తమ డిమాండ్లను అంగీకరించిన ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు మద్దతుగా నిలిచిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుదుచ్చేరి ఆవిర్భావ వేడుకకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

నవంబర్ 1న పుదుచ్చేరి విమోచన దినోత్సవ వేడుక ఏర్పాట్లును స్థానిక జిఎంసి-లయోగి క్రీడా ప్రాంగణంలో చేపట్టారు. ఆర్‌ఓ మునిస్వామి జాతీయ జెండా ఆవిష్కరిస్తారని, అనంతరం విద్యార్థినీ విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని సమాచారశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఓల్డేజ్ హోం సిబ్బందికి దీపావళి కానుక

ప్రజాశక్తి - యానాం

దీపావళి సందర్భంగా యానాం ఓల్డేజ్ హోం సిబ్బందికి సంస్థ వ్యవస్థాపకులు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం దీపావళి కానుకను అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి దీపావళి క్రాకర్స్, స్వీట్స్, బట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హోం కోఆర్డినేటర్ పెసల గంగయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్యద కార్మికులు ధర్నా నిర్వహించార. బుధవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో సిఐటియు నాయకులు కె.చిన్న, కె.విశ్వనాథం మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణకు అవసరమైన పని ముట్లు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్స్, యూనిఫాంతోపాటు కుట్టు కూలీ, గ్లౌజులు, చెత్తను తరలించేందుకు వాహనాలను సమకూర్చాలని అన్నారు. మూడేళ్ల కితం మృతి చెందిన కార్మికుడు బంగారు రాముకు చెల్లించాల్సిన బెనిఫిట్స్‌ను తక్షణమే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవికుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఎన్.యేసమ్మ, సిహెచ్.రమణ, రామారావు, ఎన్.పైడిరాజు, బి.సత్యవతి, లోవబాబు, రాజమోహన్, గడ్డం రాజులు, సింహాచలం, దివ్యవాణి, పార్వతి, సతీష్ పాల్గొన్నారు.

మద్యం నిషేధిస్తేనే అసలైన దీపావళి

ప్రజాశక్తి - పిఠాపురం

సారా, మద్యంను నిషేధిస్తేనే అసలైన దీపావళి అని మద్యపానం వ్యతిరేక ప్రచారం కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్య నారాయణ అన్నారు. బుధవారం స్థానిమా జగ్గయ్య చెరువులో ఎస్.టి కాలనీలో మద్యపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు సారా, బ్రాందీ, విస్కీ దహన కార్యక్రమం నిర్వహించారు. పాలకులు మద్యాన్ని ఆదాయ వనరుగా చూసే విధానం మారాలని కోరారు. కరణం విశ్వనాథం, కౌన్సి లర్ పోసయ్య, న్యాయవాది జిఎస్.భాస్కర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అత్తిలి కుటుంబానికి తుమ్మల పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

కుటుంబీకులతో మాట్లాడుతున్న బాబు

స్థానిక 27వ వార్డు జనసేన ఇన్‌ఛార్జ్ అత్తిలి కృష్ణ కుటుంబాన్ని జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పరామర్శించారు. కృష్ణ అన్నయ్య అత్తిలి వీరభద్రరావు(48) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆయన కుటుంబాన్ని తుమ్మల రామస్వామి పరామర్శించారు. ఈ పర్యటనలో పట్టణ జనసేన అధ్యక్షులు సరోజ వాసు, నాయకులు మంచెం సాయిబాబు, వైసిపి నాయకులు రెడ్నం దొరబాబు పాల్గొన్నారు.

In the Court of the IVth Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 401/2024

Between:
State Bank of India, Sarpavaram Junction Branch, Kakinada, Rep. by its Branch Manager. ...Plaintiff
AND
Komarthi Narayana Rao ...Defendant

To:
Komarthi Narayana Rao, S/o. Kameswara Rao, aged 37 years, D.No. 4-74, Near Panchayat Office, Sarpavaram, Kakinada Rural Mandal, Kakinada Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 15-11-2024వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ
సెల్: 9866211196

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
HMOP. NO: 51/ 2023

Between :
మందలపు వినోద్ కుమార్ ...... పిటిషనరు
V/s
మందలపు ఎలియాస్ పంపన కళ్యాణి..రెస్పాండెంటు

To
మందలపు ఎలియాస్ పంపన కళ్యాణి
W/o వినోద్ కుమార్, R/o హుకుంపేట (గ్రామం), మరియు (పోస్టు), రాజమండ్రి రూరల్ (మండలం) తూర్పుగోదావరి (జిల్లా) ఆంధ్రప్రదేశ్.
(రెస్పాండెంటు)

పైన తెలిపిన పిటీషనరు మీ పైన SEC 9 హిందూ వివాహ చట్టం ప్రకారం మిమ్ము కాపురమునకు రమ్మనికోరుచూ దాఖలు చేసుకున్న పై నెంబరు పిటిషన్లో మీరు రెస్పాండెంటు అయివుండి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయు చున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 15-11-2024 న తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపవలెను. లేనిచో మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించబడునని ఇందుమూలక ముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి అనుమతితో//

అద్దంకి: ఇట్లు
తేది :29-10-2024 పంచాగ్నుల రమేష్
అడ్వకేట్ /అద్దంకి
బాపట్ల జిల్లా.
సెల్ నెం : 99487 88290

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
A.S. No. 104/2023

Between:
Ch.Subba Rao ...Appellant
AND
Association of Promoting Spiritual and Socio Economic Activities and Others ...Respondents

R-4: అనిశెట్టి వెంకటాచలం,
S/o. లక్ష్మి నరసింహమూర్తి,
రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 05-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి జె.బి.ఎస్.బాపూజీ
30-10-2024 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
E.A. No. 123/2024
E.P. No. 160/2020
O.S. No. 488/2006

Between:
మల్లిపూడి వెంకటకృష్ణ సుబ్బారావు ...DHr
మరియు
చింతపెంట సావిత్రిదేవి ...JDr

To:
చింతపెంట సావిత్రిదేవి, W/o. వెంకట సుబ్బారావు, డోర్ నెం. 7-2-1, రామారావుపేట, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు అమలు గ్రంధములో JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 15-11-2024వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ
సెల్: 9866211196

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 349/2023

Between:
State Bank of India, R.A.S.M.E.C.C.C. & S.A.R.C., Danavaipeta, Rajahmundry, Rep. by its Manager, S.A.R.C. wing ...Plaintiff
AND
Peddireddi Peddiraju, S/o. Satyanarayana, aged 41 years, H.No. 28/188, Near Daggula Hospital, Penugonda Mandalam, W.G.District, Pin: 534 320. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 15-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.సుజాత, అడ్వకేట్
రాజమండ్రి ప్రకాష్‌నగర్, రాజమండ్రి
30-10-24 సెల్:8317648715

In the Court of the Principal Senior Civil Judge, Kakinada
I.A. 358/2024 in O.S. 151/2021

Between:
1. M.Balaji Babu
2. Pasupuleti Prem Kumar
...Petitioners/ Plaintiffs
AND
1. Kosireddy Gurumurthy Naidu
2. Thota Rama Rao (died) Others
...Respondents/ Defendants

To:
5th Respondent:
Perneedi Satyaveni, W/o. Sathi Raju, age 58 years, D.No. 70-17A-25/11/1, Soujanya Nagar, Kakinada, Kakinada Dist.,

The Petitioner filed above petition preying Hon'ble Court to add you as 5th Defendant as legal heir of deceased 2nd Defendant in above suit. Take notice that you are hereby directed to appear before above Hon'ble Court on 19-11-2024 at 10.30 AM to submit your answer. Otherwise the matter will be decided in your absence. This notice was issued as per the order of Hon'ble Court through this paper publication.

D.SURYANARAYANA MURTHY
V.VIJAYARAJ KUMAR
V.KONDALA RAO
Advocates, Kakinada
Cell: 8247256301, 9177313333